క్లుప్తంగా

కారును ఢీకొన్న లారీ

• ఒకరికి తీవ్రగాయాలు



దెబ్బతిన్న కారు

మనుబోలు : కారును వెనుక నుంచి లారీ ఢీకొన్న ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద గురువారం జరిగింది. చెన్నైకి చెందిన దేగా దయాకర్‌రెడ్డి కోర్టు పనుల నిమిత్తం నెల్లూరుకు వస్తున్నారు. బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ అదుపుతప్పి కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో దయాకర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

కారు ఢీ.. బైక్ నుజ్జునుజ్జు



కారు కిందపడి ఉన్న బైక్

ఇందుకూరుపేట : మండలంలోని రావూరు గ్రామంలో కారు ఢీకొనడంతో బైక్ నుజ్జునుజ్జయింది. స్థానికుల కథనం మేరకు.. అనంతపురం నుంచి కారులో కొందరు గురువారం మైపాడు బీచ్‌కు వచ్చారు. తిరిగి వెళ్లే సమయంలో రావూరు సమీపాన కారు అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపిన బైక్‌ను ఢీకొంది. ఈ వేగానికి పక్కనే ఉన్న మరో కారును కూడా ఢీకొని బైక్ నుజ్జునుజ్జు అయింది. నిలిచి ఉన్న మరో కారు సైతం కొంత దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

కారు, ఆటో ఢీ

• ఐదుగురికి గాయాలు

ఇందుకూరుపేట : మండలంలోని నరసాపురంలో గురువారం రాత్రి కారు– ఆటో ఢీకొని ఐదుగురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. మైపాడు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు నరసాపురం గమళ్లపాళెం వద్దకు చేరుకునే సరికి ఎదురుగా కూలీలతో వస్తున్న ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

శ్మశాన నిర్మాణానికి రూ.25 లక్షల విరాళం

విడవలూరు(కొడవలూరు) : కొడవలూరు మండలంలోని గుండాలమ్మపాళెంలో శ్మశానం నిర్మాణానికి వీపీఆర్ ట్రస్ట్ ద్వారా రూ.25 లక్షల విరాళమిస్తున్నట్లు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రకటించారు. గుండాలమ్మపాళెంలో సామాజిక పింఛన్‌లను గురువారం పంపిణీ చేసిన ఆమె అనంతరం రూ.5 లక్షలతో వేసిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులకు శ్మశాన సదుపాయం లేదని విన్నవించుకున్న నేపథ్యంలో ట్రస్ట్ ద్వారా విరాళమిస్తున్నట్లు తెలియజేశారు. తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి, ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు, సర్పంచ్ దివ్యారెడ్డి, స్థానిక నాయకులు శేఖర్‌రెడ్డి, పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి, అమరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

⇨ తోటపల్లిగూడూరు : మండలంలోని విలుకానుపల్లి గిరిజన కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సర్వేపల్లి టీడీపీ సమన్వయ కర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, నాయకులు ముత్యాల శ్రీనివాసులు, గోపిరెడ్డి వెంకటేశ్వర్ల యాదవ్, శివయ్యనాయుడు, చేవూరు శ్రీనివాసులు, నెల్లిపూడి సుధాకర్ పాల్గొన్నారు.

విద్యతోనే వికాసం



మనుబోలు : మాట్లాడుతున్న సీడీపీఓ విజయలక్ష్మి

మనుబోలు : విద్య ద్వారానే బాలికల వికాసం సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కిశోర వికాసం పేరుతో బాలికలకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు క్రమశిక్షణతో మెలుగుతూ బాగా చదువుకుని స్వశక్తితో నిలబడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జలజాక్షి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గేయ పూజిత, ఎంఈఓ రమేష్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేడే

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడేను నగరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కనకమహల్ సెంటర్ సమీపంలోని పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి సీపీఎం నేతలు నివాళులర్పించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో సీపీఎం జెండాలను ఎగురవేసి మేడే శుభాకాంక్షలను తెలియజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడారు. లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా ఈ నెల 20న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నేతలు అజయ్‌కుమార్, మాదాల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, అశోక్, లోకేష్, కామాక్షమ్మ, జయకుమార్, మూలం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

➡ సంతపేటలోని సీపీఐ కార్యాలయం వద్ద పార్టీ పతాకాన్ని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి సిరాజ్ ఎగురవేశారు. నేతలు షానవాజ్, రామరాజు, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, వినోదిని, వనజ, సోఫియా, సాయిలత, ఖాదర్‌బాషా, షాకీర్, సూరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

➡ సండే మార్కెట్లో సీఐటీయూ పతాకాన్ని యూనియన్ ఆధ్వర్యంలో ఎగురవేశారు. మార్కెట్ యూనియన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నేతలు అర్జున్, సాదిక్, ఖాదర్‌బాషా, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): పోరాటాలతోనే హక్కులను సాధించుకోగలమని సీఐటీయూ నెల్లూరు రూరల్ నియోజకవర్గ అధ్యక్షుడు కొండా ప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్, ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎర్ర జెండాలను ఆవిష్కరించారు.

➡ పెద్దాస్పత్రిలో రోగుల సహాయకులకు అన్నదానాన్ని ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నేతలు కమ్మటి శ్రీనివాసులు, సందానీబాషా, రాజీవ్‌రెడ్డి, పెంచలయ్య, శామ్యూల్, విజయ్, కళా, సాల్మాన్, సన్ని, శివ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నేతలు



జలకన్య సెంటర్‌లో..



సండే మార్కెట్లో..



జీజీహెచ్ సమీపంలో..



ఏసీనగర్‌లో..

ఆత్మీయ సత్కారం

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన హరినాథ్‌ను గురువారం సత్కరించారు. ఆయన సేవలను ప్రిన్సిపల్ రామారావు కొనియాడారు. ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఏసుదాసు, వివిధ శాఖాధిపతులు హరితాదేవి, రామ్‌ప్రసాద్, శివకుమార్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



రంగనాథుడికి విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): భగవద్రామానుజాచార్యులు అవతారోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో సేవాకాలం, శాత్తుమొరైను గురువారం నిర్వహించారు. భగవద్రామానుజాచార్యులుకు మంగళశాసనోత్సవం, పేట ఉత్సవం, తిరుమంజనాన్ని జరిపారు. ఈఓ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

పింఛన్ల పంపిణీ నూరు శాతం జరగాలి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియను నూరు శాతం పూర్తి చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. స్నేహనగర్ రెండో వీధిలో లబ్ధిదారులకు పింఛన్ నగదును గురువారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. 26 మంది జోనల్ ఇన్‌చార్జీలు తమకు కేటాయించిన సచివాలయాల పరిధిలో పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు.



పింఛన్ నగదును అందజేస్తున్న నందన్

కార్మికులకు టవళ్ల పంపిణీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు టవళ్లు, టీ షర్టులను స్మైల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యతిరాజ్, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మదార్, అజ్మీర్‌బాషా, కోశాధికారి నారాయణ, డిస్ట్రిక్ట్ – 203 ఎలక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, రాజగోపాలరెడ్డి, రాఘవరెడ్డి, శ్యామ్, భక్తవత్సలరెడ్డి, సుబ్రహ్మణ్యం, ఖమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

లారీల పార్కింగ్‌కు అడ్డా

నెల్లూరు(బారకాసు): నగరంలో ట్రాఫిక్ రోజురోజుకూ పెరిగిపోతోంది. ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు అనేక చర్యలు చేపడుతున్నా, కొందరు తమ ఇష్టానుసారంగా వాహనాలను నిలుపుతూ సమస్యను జఠిలం చేస్తున్నారు. నగరంలోని శెట్టిగుంటరోడ్డు చివర్లో సర్వేపల్లి కాలువపై రెండు బ్రిడ్జిలను నిర్మించారు. అయితే కొంత మంది లారీల యజమానులు తమ వాహనాల పార్కింగ్ కోసం బ్రిడ్జిలను ఉపయోగించుకుంటున్నారు. దీనిపైనే లారీలు, వ్యాన్లను నిలుపుతున్నారు. రోజుల తరబడి ఇలానే ఉంచుతున్నారు. దీంతో రాకపోకల సమయంలో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వైద్య శాఖ ఉద్యోగి మృతి బాధాకరం

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మలేరియా విభాగ జిల్లా బయాలజిస్ట్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని ఏపీ హంస అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమల్‌కిరణ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే మృతి చెందడం బాధాకరమని చెప్పారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

విజ్ఞాన శిబిరాలతో మానసికోల్లాసం

మనుబోలు : వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుందని మనుబోలు లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ అన్నారు. మనుబోలు గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులకు చెస్, క్యారమ్స్, క్విజ్ పోటీలు నిర్వహించారు. పేపర్ క్రాఫ్ట్‌పై అవగాహన కల్పించి విద్యార్థులతో బొమ్మలు చేయించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికితీసేలా వివిధ రకాల కార్యక్రమాలను రూపొందించామన్నారు.

⇨ విడవలూరు(కొడవలూరు) : కలర్ పేపర్స్‌తో క్రాఫ్ట్ చేయడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని లైబ్రేరియన్ కె.రాజేశ్వరి సూచించారు. స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో రంగుల పేపర్లతో గురువారం బొమ్మలు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో అనేక రకాల నైపుణ్యాలుంటాయని, సాధన చేయించడం ద్వారా వాటిని వెలుగులోకి తేవచ్చన్నారు. అనంతరం మేడే ప్రాముఖ్యతను వివరించారు.



కొడవలూరు గ్రంథాలయంలో..

వైఎస్సార్‌సీపీ రూరల్ కమిటీ నియామకం

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ మండల కమిటీని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. పార్టీ రూరల్ ఉపాధ్యక్షులుగా దొడ్ల మస్తానయ్య, బొడ్డు వెంకటేశ్వరరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా చింతా నాగేంద్ర, కొమ్మి శివాజీ, గుంజి బాబూరావు, ట్రెజరర్‌గా పార్లపల్లి వీరరాఘవరెడ్డి, సెక్రటరీలుగా గంపాల వెంకటరమణ, పసుపులేటి సుధాకర్, గుమ్మడి కమలాకర్, సెల్వరాజ్ రణదీప్, అల్లారెడ్డి రవీంద్రరెడ్డిని నియమించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గుంజి శ్రీనివాసులు, ఆవుల గోపాలయ్య, చేవూరు గీతమ్మ, పలగాని శివకుమార్‌రెడ్డి, తుమ్మల కిరణ్‌కుమార్‌రెడ్డి, నీలం శ్రీధర్, సంది శ్రీనివాసులు, గంపాల సుధాకర్, కోట గోపాల్‌రెడ్డి, ముదివర్తి శ్రీనివాసులు, సంగపు పెంచలప్రసాద్, నోసిన విక్రమ్, కల్యాణ్‌బాబు, ఒంటేరు దయాకర్, బెల్లంకొండ పెంచలయ్య నియమితులయ్యారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

నెల్లూరు సిటీ: కార్మికులు ఎనిమిది గంటలే పని చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. దేవరపల్లిలోని దొడ్ల డెయిరీలో గురువారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్మికుల బాగోగులను ఆరాతీశారు. ఏమైనా ఇబ్బందులుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయ టోల్ ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలని సూచించారు. లోక్ అదాలత్ సభ్యుడు సుబ్బారెడ్డి, హెచ్‌ఆర్ హరినాథ్‌రెడ్డి, మేనేజర్ సురేష్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాణి

క్రికెట్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రికెట్ సమ్మర్ క్యాంప్‌ను గురువారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, కేఎస్ రెడ్డి, జనరల్ మేనేజర్ భానుప్రకాష్‌రెడ్డి హాజరయ్యారు. నెల పాటు ఉదయం, సాయంత్రం వేళ క్రికెట్ శిక్షణ తరగతులను నిర్వహించనున్నామని చెప్పారు.

➡ నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో ఉచిత రోలర్ స్కేటింగ్ శిక్షణ శిబిరాన్ని రోలర్ స్కేటింగ్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుధీర్‌కుమార్‌రెడ్డి, కామేష్ మాట్లాడారు. శిక్షణ కార్యక్రమాన్ని ఉదయం, సాయంత్రం వేళ నిర్వహించనున్నామని చెప్పారు. ఆరు నుంచి 16 ఏళ్లలోపు వారు అర్హులని, వివరాలకు 94400 59500, 80192 23661 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



పౌష్టికాహార పంపిణీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు హాజరయ్యే క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని ఏసీ సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా డీఎస్‌డీఓ యతిరాజ్, కోఆపరేటివ్ బ్యాంక్ సొసైటీ మాజీ సభ్యుడు బుర్రా వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ పాటోలు సత్యనారాయణ మాట్లాడారు. ఈ నెల 16 వరకు వీటిని పంపిణీ చేయనున్నామని వివరించారు. వేలూరు రంగారావు, శేగు రమేష్, హరి, దద్దోలు రమణయ్య, నిర్మల నరసింహారెడ్డి, అరిగెల సాయిరామ్, బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రప్రసాద్ కుటుంబీకులకు ఆదాల పరామర్శ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): విశ్రాంత అధ్యాపకుడు మెట్టు రామచంద్రప్రసాద్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబీకులను మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. నేతాజీనగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు స్వర్ణా వెంకయ్య, పాశం శ్రీనివాస్, యేసునాయుడు, హరిబాబుయాదవ్, మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, మొయినుద్దీన్, కల్లూరి లక్ష్మీరెడ్డి, బెల్లంకొండ వెంకయ్య, నానీ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ స్టేడియం ప్రాంగణంలో చలివేంద్రాన్ని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, వాకర్స్‌కు మజ్జిగ ప్యాకెట్లు, తాగునీటిని పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు ప్రారంభించారు. అసోసియేషన్ కార్యదర్శి నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, చెంచయ్య, నసీర్ అహ్మద్, హరిబాబు, రామ్మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కిలారి మధుసూదన్‌రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు



భవానీ అలంకారంలో కన్యకాపరమేశ్వరి

నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి జన్మదిన ఉత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భవానీ అలంకారంలో అమ్మవారు గురువారం దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఆకులూరి శ్రీహరి, ధనలక్ష్మి దంపతులు వ్యవహరించారు. నగరోత్సవాన్ని కనులపండువగా రాత్రి నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, కోశాధికారి జనార్దన్, గౌరవ సలహాదారు ఆంజనేయులు, మునగా వెంకటేశ్వర్లు, వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

